# పలకా - బలపం

కోడి 'కొక్కురో కో' అంటూ కూత పెట్టింది. గుంపులు గుంపులుగా ఎగురుతూ, ఏదో సమైక్యతా గీతాన్ని గానం చేస్తున్నట్లుగా అరుస్తున్నాయి కాకులు. లచ్చి లేచి చూసింది.

"సాన తెల్లారిపోనాది. మా మావ బేరాలకుపోవాల. పాడుసలి, నెగ నివ్వదు. దినమంతా కట్టపడితే మాత్తరం వచ్చే దేటుందా అంట? ఏటి నేదు, డొక్క అట్టాఅట్టానే ఉండిపోతాది" అనుకుంటూ భర్తవైపు జాలిగా చూసింది లచ్చి.

బాగా అలిసిపోయి, ఆదమరచి నిద్రపోతున్నాడు వెంకన్న.

"మావా! ఏ మావా!" మెల్లగా వెంకన్నను తట్టిలేపింది లచ్చి.

బద్ధకంగా వళ్ళు విరచుకుంటూ లేచి మంచం మీద కూర్చున్నాడు.

"మావా! సేనా పొద్దెక్కి పోనాది. బేరాని కెళ్ళవేటి?" అంది లచ్చి.

వెంకన్న లేచి ముఖం కడుక్కునేందుకు బయటకు వెళ్ళాడు.

"యేటో? ఎదవ బేరాలు! దినమంతా రెక్కలు ముక్కలు చేసేసుకొని కట్టబడ్డా పెళ్ళాం బిడ్డలకు కూడైనా సరిగా ఎట్టుకోనేక పోతున్నా" అనుకున్నాడు వెంకన్న.

పడుకున్న మంచాన్ని వారగా నిలబెట్టింది లచ్చి.

పిల్లలు ముగ్గురూ తాటాకుల చాపమీద ఒకరి మీద ఒకరు కాళ్ళూ, చేతులూ వేసుకొని పడుకొని ఉన్నారు.

చంటిదాన్ని తీసి ఉయ్యాలలో వేసింది లచ్చి.

"ఒలే లచ్చీ! బేరాలకి ఎల్లిపోతున్నా?" అంటూ కేకేసి వెళ్ళిపోయాడు వెంకన్న.

"పనిలోకి పోవాలి!" అనుకుంటూ నిద్రపోతున్న పిల్లల వైపు ప్రేమగా చూసింది లచ్చి.

వాళ్ళిద్దరూ నిద్దరోతున్నారు. పిల్లల మీద కప్పి ఉన్న చింకి చీర మెల్లగా తీసి "నెగరా, రాజా! నే పనికి పోతున్నా! సంటిది ఉయ్యాల్లో ఉంది. ఏడిస్తే ఎత్తుకో" అంది.

రాజా లేచి కూర్చొని దేనికోసమో చాపమీద వెతుక్కుంటున్నాడు.

"ఏటిరా ఎతుకుతున్నావు" అంది లచ్చి.

"నా పలకా—బలపం" అన్నాడు మగత నిద్దరలో ఉన్న రాజా.

"కలొచ్చిం దేటిరా? నేకపోతే పలకా బలపం నీ కేడనుంచి వత్తాయి?" అంది లచ్చి.

ఉలిక్కిపడ్డాడు రాజా. "నిజమేనే అమ్మా! బలే కలొచ్చిందే" అన్నాడు.

"కలకేటిగానీ, ఆలస్యమైపోనాది. నే పనిలోకి పోవాల, సెల్లి నెగిసాక నువ్వూ' అదీ టీ తాగండి" అంటూ చీర కొంగునుంచి పావలా కొడుకు చేతిలో పెట్టింది.

"ఈ పావలా ఎట్టి పలక కొనుక్కుంటాను" అన్నాడు హుషారుగా రాజా.

"పావలాకి పలకేడనుంచి వత్తాదిరా? అయినా టీ నీళ్ళు లేకుండా ఏటి?" అంది లచ్చి.

"అందరూ బల్లోకి పోతుండారు గదంటే! సక్కగ సదుక్కుంటున్నారు సూడే, నే నొక్కడినే సెల్లిల్ల నాడించాల?" ఏడుపు ముఖం పెట్టి అన్నాడు రాజా.

"మరెనాగదా! ఇప్పటికే ఎండెక్కి పోనాది. ఏల దాటిపోతే అమ్మగోరు కోప్పడతారు. సెల్లిల్లని జాగర్తగా సూసుకో" అంటూ పెళ్ళిపోయింది లచ్చి.

లచ్చి నాలుగిళ్ళలో పాచిపని చేస్తుంది. మొగుడు వెంకన్న రిక్షా లాగుతున్నాడు. లచ్చీ, వెంకన్నా మనసుపడి మనువు చేసుకున్నారు. మనువైన కొత్తల్లో "ఎన్నమనసు ఎంకన్న" లచ్చిని పన్లోకి పోనిచ్చేవాడు కాదు.

"ఈ సెత్తా సెదారం పని నీ కెందుకే లచ్చీ! నువ్వేటి? పన్లో కెళ్ళడం ఏటీ? నాకు బాగానేదే? నే తెచ్చే పైసలు సాలవేటి?" అనేవాడు. రోజూ ఎన్నో ముచ్చట్లు చెప్పేవాడు.

"మగబిడ్డ పుడితే రాజా అని పేరెడదాం" అనేవాడు.

లచ్చి నవ్వి, "ఎందుకు మావా! నీలా వాడూ రిక్సా తొక్కాల్సిందేగందా" అనేది.

"నా కొడుకేం రిక్సా నాగడు. సదువుకొని పెద్దాపీసరోడు లవుతాడు" అనేవాడు.

రాజు పుట్టిన ఒక ఏడాదికి లచ్చిని పనిలోకి పంపేడు వెంకన్న. నాలుగేళ్ళలో లచ్చీ వెంకన్నలు ముగ్గురు బిడ్డలకు తల్లిదండ్రు లయ్యారు.

మునుపటిలా హాయిగా ముచ్చటలాడుకునేందుకు లచ్చికి వెంకన్నకు తీరుబడి లేదు.నాలుగిళ్ళలో పని చేయడంతో లచ్చికి రోజంతా గడిచిపోతోంది రిక్సాతొక్కి సందేళకు గూటికి చేరిన ఎంకన్న అన్నం తిని నిద్రోతాడు.

దినమంతా శ్రమించే ఆ దంపతులు జీవితంలోని తొలి మాధుర్యాన్ని మరచిపోయారు.

ఆ రోజు మూడిళ్ళ పని పూర్తిచేసి లచ్చి నాలుగో ఇంటికి వెళ్ళే సరికి పదిగంట లయిపోయింది, లచ్చి భయంగా "అమ్మగోరు!" అంటూ పెరటి తలుపులు తట్టింది.

"ఇప్పటికి తీరికయిందా? నీకు డబ్బిచ్చుకొని మేమే పనులు చేసి కోవాలా? ఏంటే?" కస్సు, బుస్సుమంటూ విసుగ్గా తలుపు తీసింది సరస్వతి.

"లేదమ్మగోరూ!యేలయిపోనాది. రేపటినుంచి తెల్లోరగానే వచ్చేత్తా" చీపురు తీసుకొని పెరడు వూడుస్తూ మెల్లగా చెప్పింది లచ్చి.

అయిదు సంవత్సరాలుగా పనిచేస్తున్నా లచ్చి అంటే సరస్వతికి ఏ మాత్రం విశ్వాసం లేదు. ఏ ఒక రోజు రాకపోయినా జీతం డబ్బులు కోసేస్తుంది. కాస్త లేటైతే చాలు ఎంతో విసుక్కుంటుంది. ఆరోజు లచ్చికి కష్ట మనిపించింది, అయినా సరస్వతిని ఏమనగలదు,రెండిళ్ళలో మాత్రమే పని చేస్తేనే బాగుండుననిపించిది కాని ఎలా? "నాలుగేళ్ళలో పనిచేస్తేనే పొట్ట నిండా కూడునేవో ఒక పూటైనా? ఇక రెండు పూటలు సంగతి" ఇలా ఆలోచిస్తూ తనకు ఈ విసుగు ఈ కసుర్లు తప్పవనుకుంది. ముపుసంగా పని చేసుకుంటున్న లచ్చి రాజాను చూసి "ఎందుకొచ్చినావురా సచ్చినోడా ఈడికిం" అంది,

"అమ్మా! అమ్మా! డబ్బు లియ్యవే పలక కొనుక్కుంటాను" రాజా అన్నాడు.

"డబ్బు లేడనించొచ్చాయిరా? సెల్లిని ఇంటికాడొగ్గేసి యాడ కొచ్చేసి నావేట్రా బుద్ధిలేనోడా?" రాజాను కోపంగా చూస్తూ అంది లచ్చి.

"సిన్న సెల్లిని పెద్ద సెల్లి ఆడిత్తోంది లేయే నేను సదువుకుంటా, సరసొత్తమ్మ గోరి పిల్లలు ఎంచక్కా బడికెల్లి సదువు కుంటున్నారు. సూడ నేదంటే. నేనూ బల్లోకి పోతా." ఒకటే గోల. తల్లి కొంగు పట్టుకొని మారాం చేస్తున్నాడు రాజా.

"ఇంటి కాడికి పోరా గొల్లిగా. అయ్యతో సెప్పి పలక తెప్పిత్తాలే" ఆ ఘడియకి వోపిగ్గా వాడికి నచ్చచెప్పింది లచ్చి.

సరస్వతి వచ్చి "ఇదిగో, లచ్చి. బజారుకు యెళ్ళి చక్కెర తెచ్చి పెడుదూ" అంటూ పది రూపాయల నోటు లచ్చి చేతిలో పెట్టింది. రెండ డుగులు వెనక్కివేసి మళ్ళీ సరస్వతివైపు వచ్చి "అమ్మగోరూ" అని పిలిచింది.

"ఏమిటి? చెప్పు?" అంది సరస్వతి.

"నా జీతం ఇత్తా నన్నారమ్మా" అంది లచ్చి.

"ఇస్తాలేవే. త్వరగా చక్కెర తీసుకురా. పిల్లలు మిటాయి చెయ్య మంటున్నారు" అంది సరస్వతి.

"ఇప్పుడే వచ్చేత్తారా. ఈడనే కూరొచ్చో" అంటూ దుకాణానికి వెళ్ళి పోయింది లచ్చి.

రాజా పిల్లలు చదువుకుంటున్న గది దగ్గరకు వెళ్ళాడు. సరస్వతి

చిన్న కొడుకు మధు, పలకమీద రాసుకుంటున్నాడు. రాజా మధు దగ్గరగా వెళ్ళి చూస్తూ కూర్చున్నాడు.

"ఏంటి? అలా చూస్తున్నావు? నీకు అక్షరాలు రావా" అడిగాడు మధు.

"నాకు పలకే లేదు, సినబాబూ! అచ్చరాలెలా ఒత్తాయి" అన్నాడు చిన్నబుచ్చుకుంటూ, రాజా.

"పలక కొనుక్కుని రోజూ బడికి వెళ్ళు. బోలెడు చదువు వస్తుంది అన్నాడు మధు.

"మధుబాబూ! ఒక్కసారి నీ పలక ఈయవ్వా" జాలిగా అడిగాడు రాజా.

మధు తన పలక రాజా చేతుల్లో పెట్టాడు. రాజా మనస్సు పట్టరాని ఆనందంతో నిండిపోయింది. పలక ఇప్పుడు తన చేతుల్లో ఉంది, పక్కన ఉన్న బలపంకూడా చేతుల్లోకి తీసుకున్నాడు.

"ఇలా పలకా బలపం పట్టుకుని బడికి ఎలితే ఎంత బాగుంటాది" లేచి నిలబడ్డాడు రాజా. రాజకుమారుడిలాగ చేతుల్లో పలకను చూసుకుని మురిసిపోతూ ఠీవిగా నిలుచుని ఉన్నాడు. ఆలోచనా తరంగాల్లో మునిగి పోయాడు. అంతే! చెయ్యిజారి పలకకింద పడింది.

మధు చూస్తూ ఉండగానే పలక పగిలి పోయింది. ముక్కలు ముక్కలైంది. బిగ్గరగా ఏడవడం మొదలు పెట్టాడు మధు. రాజా గుండె చెక్కలైంది. భయంతో గజగజ వణికి పోతున్నాడు. పగిలి పోయిన పలకనూ, ఏడుస్తున్న మధునూ చూస్తూ మరింతగా రాజా కాళ్ళూ, వళ్ళూ వణికి పోతున్నాయి పరుగెత్తుకొని వస్తున్న సరస్వతిని చూసి—

"ఏమయిందిరా, మధూ!" అంది.

మధు ఏడుస్తూనే విషయం చెప్పేడు. సరస్వతి బిగ్గరగా రాజాను తిట్టడం ప్రారంభించి నానా దుర్భాషలు ఆడుతోంది.

"ఏబ్రాసి వెధవలు. గుడిసెల్లో పడున్నవాళ్ళు మేడల్లోకి రావడం ఏంటి? సిగ్గా, లజ్జా? ఇలాంటి వెధవల్ని పనిలోకి పెట్టుకోవడమే తప్పు. ఏదో వెధవపని చేస్తూనే ఉంటారు. గుడిసెల్లో పడి ఉండక మేడల్లోకి రావడం ఎందుకురా? సిగ్గులేక ఎక్కడి వెధవలు అక్కడ పడి ఉండక" అంటూ ఇంకా ఏమేమిటో అన్నదే పదిసార్లు అంటూ ఉంది.

దుకాణం నుంచి వచ్చిన లచ్చి విషయం తెలుసుకొని, తను కూడా "పాడు ఎదవా! ఈడ కెందుకొచ్చేవురా? నీ మొగానికి పలక కూడానా?" అంటూ కొడుకునే తిట్టింది. నాలుగు కొట్టింది.

రాజా గుడ్లు తేలేసి కొట్టిన తల్లి దగ్గరకే వెళ్ళి నిల్చుని భోరుమని ఏడుస్తూ తిడుతూ ఉన్న తల్లి రెండు కాళ్ళూ పట్టేసుకున్నాడు. ఆ పసివాడి కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగి చెక్కిళ్ళ మీదుగా వరదై కారుతున్నాయి. వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. సరస్వతి విసుక్కుంటూనే ఉంది. ఇంకా తిడుతూనే ఉంది.

లచ్చి మెల్లగా. భయంగా "అమ్మగోరూ! జీతం డబ్బులు" అంది.

సరస్వతి నాలుగు రూపాయలు లచ్చి చేతిలో పెట్టింది. లచ్చి ఆశ్చర్యంగా చూస్తూ విస్తుపోయింది. కొయ్య బొమ్మలా నిలబడి పోయింది.

"నీ కొడుకు రూపాయి పలక పగలకొట్టేడు. నీకు ఈనెల నాలుగు

రూపాయలే వచ్చేది. ఎన్నో నాగాలు పెట్టేవు కూడా!" అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

పలక పగల కొట్టినందుకు కొరకొరా చూసి, రెక్క పట్టుకొని కోపంగా ఈడ్చుకుంటూ కొడుకుని ఇంటికి తీసుకు వెళ్ళింది లచ్చి.

నెలకి ముప్పై రోజులు కష్టపడితే ఫస్టునాడు ఈ మాత్రం డబ్బులు చేతి కొస్తాయి. ఇలా ఏం జరిగినా ఇచ్చే జీతంతో కొంత కొట్టేస్తారు. ఉసూరుమంటూనే ఇంటి కొచ్చింది లచ్చి.

రాజాను చూస్తుంటే లచ్చికి కోపం ముంచుకొస్తున్నాది. "పలక ఎందుకు పగల గొట్టేవురా. గాడిదా? బుద్ధిలేనోడా, ఎర్రి ఎదవా. అమ్మగోరు రూపాయి కోసేసినారు సూడు" అంటూ కొడుకు వీపుమీద మరో నాలుగు దెబ్బలు వేసింది. ఏడుస్తూ ఒక మూల పడుకున్నాడు రాజా.

లచ్చి పొయ్యి అంటించి వేడినీళ్ళు కాచి చిన్నపిల్ల లిద్దరికీ స్నానాలు చేయించింది. అన్నం వండి పొయ్యిమీద పులుసుపెట్టి ఆలోచిస్తూ కూర్చుంది.

మనసేమీ బాగానేదు పసివాడిని కొట్టేను. అడేం సేసిండు. అందరి నాగా సదువుకుంటానంటాడు. అంతే ఈ లోకంలో మనుషులు మనసుల మధ్య ఈ తేడాలు ఆడికేం తెల్సుగందా ఎర్రి నాగమ్మ" అనుకుంది.

నేలమీద పడుకున్న రాజాను లేపి ఆప్యాయంగా అన్నం నోట్లో పెట్టి తినిపించింది.

రాజా చెల్లితో ఆడుకుంటున్నాడు.

"వోరన్నోయ్! మన మెప్పుడు బళ్ళో కెళతాం" జట్లు జట్లుగా స్కూలుకు వెళ్ళుతున్న పిల్లలను చూస్తూ అడిగింది రాజా చెల్లెలు.

"ఎల్తాంలేయే.నాన్న పలక కొంటానన్నాడు బడికి పంపిత్తానన్నాడు" అన్నాడు రాజా.

పిల్లలు మాటవిన్న లచ్చి మావ ఒట్టి పిచ్చోడు. పిల్లల్ని సదివిస్తానంటాడు. ఎట్లాగ సదివిస్తాడు. మనకి సదువేటి మావా? అంటే ఆ రోజొత్తాదినేయే అంటాడు ఎర్రిబాగులోడు. నిజంగా ఆ రోజు ఏనాగొత్తాది?ఎందుకొత్తాది. ఎప్పుడూ రాదు" నిట్టూర్చింది లచ్చి.

ఆ సాయంత్రం లచ్చి పనినుంచి వచ్చేసరికి వెంకన్నపిల్లలతో ఆడుకుంటున్నాడు. లచ్చి వెంకన్నను చూసి ఆశ్చర్యపోయింది.

"అప్పుడే వచ్చావే మావా" అని లచ్చి అడిగేసరికి వెంకన్న మొహంలో చిరునవ్వు వెలిగింది.

"నీ కో మాట సెప్పేద్దామని బేగి వచ్చేసానే. నే సెప్పనేదంటే. లచ్చి! దాని తస్సదియ్య ఆ కాలమొచ్చిందే" అన్నాడు.

లచ్చి కేమీ అర్థం కాలేదు. అలా చూస్తూ నిలబడి పోయింది.

"నీ కర్థం కానేదంటే? మన పేదోళ్ళ బాధలు పెభుతోరు అర్థం చేసుకున్నారు. మనలాటోళ్ళకి సాయం చేయటానికి పెభుతోరు బాంకోళ్ళ,మనకి వడ్డీ లేకుండా అప్పిప్పింతారంటే. యీరిగోడు సూరిగాడూ అందరూ సెప్పిండ్రు" అన్నాడు వెంకన్న.

"ఏందో మావా! నా కెరి కయ్యే బాగసెప్పు" అంది లచ్చి.

"రిక్షా కొనుక్కోడానికి మనకి బేంకోళ్ళు పైసాలిత్తారంట. రోజువారీగా కొద్ది కొద్దిగా సొమ్ము బాంకోరికి కట్టేసుకోవొచ్చు మరి ఒనరోడికి అద్దెకట్టే బాధుండదు."

"సరే మావా" ఈ పొద్దు బేగి ఒచ్చిండావు. తొందరగా అన్నం తినేదాం" అంది లచ్చి.

ప్రభుత్వ సహకారంతో వెంకన్న స్వంత రిక్షా కొనుకున్నాడు. అతనికి ఎంతో ఆనందంగా ఉంది. తను ఎలాగైనా శ్రమపడి పిల్లలకు మంచి భవిష్యత్తు కల్పించాలి. లచ్చిని సుఖపెట్టాలి అనుకున్నాడు వెంకన్న.

ఒక రోజు వెంకన్న వచ్చేసరికి రాజా పలక కోసం ఏడుస్తున్నాడు.

"ఏటే లచ్చీ, ఈడి ఏటి?" అడిగాడు వెంకన్న.

"రోజూ ఒకటే గోల మావా! పలకా బలపం. అయేకావాలంటాడు. పలకా బలపం ఎట్టి సదువు కుంటాడంట. ఎర్రిబాగులోడు ఎనాగరా అదవు తదంటే ఇనడు. పోనీ సెల్లి పెద్దదైనాక ఎల్దువునేరా అంటేకూడా ఇన కుండా గోలెడు తున్నాడు" అంది లచ్చి.

"అయ్యా! అవునయ్యా. అమ్మ ఇదివరకూ ఇనాగే సెప్పింది. సెల్లి పెద్దదయ్యాక ఎల్దువునేరా అని ఆ సెల్లి పెద్దదైతే యీ సెల్లి సిన్నదుంది. యీ సిన్న సెల్లి పెద్దదైతే మరో సెల్లి ఒత్తాది. అప్పుడిది పెద్ద దవ్వాల?" వెక్కి వెక్కి ఏడుస్తూనే అన్నాడు రాజా మరి నా చదువింతే అన్నట్టు

లచ్చీ వెంకన్నలకు కర్తవ్యం గుర్తుకొచ్చింది. ఒకరి ముఖాలు ఒకరు చూచుకున్నారు.

"నిజమే మావా! ముందు ఆలోచన నేకపోతే రాజా సెప్పినట్టే అవుతాది" అంది లచ్చీ.

"అవునే లచ్చీ. మనకే ముగ్గురే చాలు" అన్నాడు వెంకన్న.

ఏడుస్తున్న రాజాను దగ్గరకు తీసుకుని—"నిజంగా పలకా బలపం అట్టు కొస్తా. నిన్ను బడిలోకి పంపుతా" అంటూ సముదాయించాడు.

ఆ రోజు సముదాయించడమే కాదు, రాజాకు పలకా బలపం కొని తెచ్చి బడికి పంపించాడు. పలకా బలపం చేతిలో పట్టుకుని అయ్య రిక్షాలో మొదటిసారిగా బడికి పెళుతుంటే ఆ పసివాడి మనసు ఎంతో సంతృప్తితో నిండి పోయింది.

"అందరిలా నేనూ బడి కెళుతున్నా. బాగా సదువుకుంటూ పెద్దోడి నౌతా" అనుకున్నాడు. పలకా బలపం మళ్ళీ మళ్ళీ చూసుకున్నాడు. రిక్షా దిగి పిల్లలందరితో బడికి పెళ్ళిపోతున్న రాజాను చూసి మురిసి పోయాడు వెంకన్న. నా రాజా సక్కంగా సదువుకుంటాడు, పెద్దాపీసరోడు అవుతాడు అనుకుంటూ తన రిక్షా తొక్కుకుంటూ పెళ్ళిపోయాడు బేరాలకి.

* * *